
www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 15 ఏప్రిల్ 2025
5
ఏలూరు



గుండెపోటుతో ఏపిగుంట ఎంపిటిసి మృతి


నరసింహారావు (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - టి.నర్సాపురం

మండలంలోని శ్రీరామవరం గ్రామానికి చెందిన ఏపిగుంట ఎంపిటిసి సులకాని నరసింహారావు (60) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. వైసిపికి చెందిన ఈయన నెల రోజుల క్రితం అస్వస్థతకు గురికావడంతో కుటుంబీకులు విజయవాడ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండెకు స్టంట్ మార్చారని కుటుంబీకులు తెలిపారు. ఈ క్రమంలో శనివారం రాత్రి ఇంటివద్దే మరోసారి గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వారు తెలిపారు. నరసింహారావు మృతి పట్ల మండలంలోని వైసిపి, టిడిపి, జనసేన నాయకులు పలువురు సంతాపం తెలిపారు.

'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో
భరోసా కరువు..!

నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో నిరంకుశ వైఖరి
పథకం వర్తించినా అందని వైద్యం
ప్రసవాలు, ఎముకలు, కిడ్నీ వ్యాధుల్లో పరిస్థితి మరింత దారుణం
రూ.లక్షల్లో చెల్లించేందుకు రోగుల బంధువుల కన్నీరుమున్నీరు
ఫిర్యాదు చేస్తే వైద్యం అందించబోమని బెదిరింపులు
ప్రభుత్వం నుంచి నియంత్రించే వ్యవస్థ కరువు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

పేదోడి ఆరోగ్యానికి ఎన్‌టిఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) పథకం భరోసా ఇవ్వని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఎన్‌టిఆర్ వైద్యసేవలో నిర్దేశించిన రోగాలకు సైతం నెట్‌వర్క్ ఆసుపత్రులు పెద్దఎత్తున సొమ్ము వసూలు చేస్తున్న పరిస్థితి ఉంది. దీంతో సామాన్య ప్రజానీకానికి ఏం చేయాలో అర్థం కాక అప్పులు తెచ్చి వైద్యం చేయించుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రాణాపాయ పరిస్థితుల్లో అదనంగా డబ్బులిస్తేనే చేర్చుకుంటామంటూ ఎన్‌టిఆర్ వైద్యసేవలోని నెట్‌వర్క్ ఆసుపత్రులు రోగుల బంధువులను బెదిరించి మరీ జేబులు గుల్ల చేస్తున్న పరిస్థితి ఉంది. ఏలూరు జిల్లాలో 31, పశ్చిమగోదావరి జిల్లాలో 23 ప్రయివేటు ఆసుపత్రులు ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రులుగా ఉన్నాయి. కంటి ఆపరేషన్లు, కిడ్నీ, ఎముకలు, కేన్సర్, గుండె ఇలా అనేక రోగాలకు 'ఎన్‌టిఆర్ వైద్యసేవ'లో చికిత్స అందించాల్సి ఉంది. ప్రతినెలా పెద్దఎత్తున సర్జరీలు జరుగుతున్నాయి. అయితే ఉచితంగా మాత్రం జరగడం లేదనేది మాత్రం వాస్తవం. సంబంధిత వ్యాధులకు ప్రభుత్వం నిర్దేశించిన రుసుములకు అంగీకరించిన ఆసుపత్రులే ఎన్‌టిఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల జాబితాలో ఉంటాయి. అయినప్పటికీ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం సరిగ్గా అమలు కాని పరిస్థితి ఉంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగిని చేర్చుకున్నా భారీగా సొమ్ము వసూలు చేస్తున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నా రోగులు, వారి బంధువులు ఫిర్యాదు చేయకుండా తామేమీ చేయలేమంటూ ఎన్‌టిఆర్ వైద్యసేవా విభాగం చేతులెత్తేసోంది. దీంతో నెట్‌వర్క్ ఆసుపత్రులు 'ఆడిందే ఆట.. పాడిందే పాట' అన్నట్లు పరిస్థితి తయారైంది. నిబంధనల ప్రకారం ఎన్‌టిఆర్ వైద్యసేవలో వర్తించే రోగానికి ఓపి నుంచి అన్ని టెస్టులూ ఉచితంగానే చేయాలి. ఒకవేళ ముందుగా ఏమైనా టెస్టులు చేసి డబ్బులు తీసుకుంటే ఎన్‌టిఆర్ వైద్యసేవ వర్తింపజేసిన తర్వాత ఆ సొమ్ము తిరిగిచ్చేయాలి. ఏఒక్క ఆసుపత్రిలోనూ ఇది జరగడం లేదు. అక్కడ పని చేసే ఆరోగ్యమిత్రలు సైతం ఆసుపత్రుల నిరకుంశ వైఖరిని ఎదిరించలేని పరిస్థితి కనిపిస్తోంది. రోగి బంధువులు డబ్బు వసూలు చేస్తున్నారని ఫిర్యాదు చేసినప్పటికీ వారు తీసుకునే చర్యలు పెద్దగా కన్పించడం లేదు. ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడి రోగి బంధువులను దారికి తెచ్చే ప్రయత్నాలు సాగుతున్నాయి.

నెట్‌వర్క్ ఆసుపత్రుల దోపిడీని నిరోధించే వ్యవస్థ కరువు

ఎన్‌టిఆర్ వైద్యసేవలోని అత్యధిక ఆసుపత్రుల్లో వసూళ్లప ర్వం నిర్విరామంగా సాగుతోంది. దీన్ని కఠినంగా నిరోధించే వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయడం లేదు. కొనఊపిరితో తీసుకొచ్చిన రోగి బంధువులను మానసికంగా ఇబ్బంది పెట్టి వసూళ్ల దందా సాగిస్తున్నారు. ప్రశ్నిస్తే రోగి ప్రాణానికి ముప్పు వాటిల్లుతుందనే భయం కుటుంబీకులను వెంటాడుతోంది. దీంతో అప్పు చేసి మరీ ఆసుపత్రులకు చెల్లిస్తున్నారు. అటువంటప్పుడు ఎన్‌టిఆర్ వైద్యసేవ ట్రస్ట్ ఉండి ఏమిటి ప్రయోజనం అనే చర్చ జనంలో నెలకొంది. ఎన్‌టిఆర్ వైద్యసేవలో రోగి బంధువుల నుంచి డబ్బు వసూలు చేసినా, వైద్యం అందించబోమని నిరాకరించినా కఠిన చర్యలు తీసుకునే విధంగా ప్రభుత్వం సరికొత్త వ్యవస్థను తీసుకురావాల్సి ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందో, లేదో వేచిచూడాలి.

భీమవరంలోని ఎన్‌టిఆర్ వైద్యసేవ పరిధిలోని నెట్‌వర్క్ ఆసుపత్రిలో ఓ మహిళ ప్రసవం చేయించుకుంది. నిబంధనల ప్రకారం ఒక్క రూపాయి చెల్లించకుండా ఉచితంగా ఎన్‌టిఆర్ వైద్యసేవలో కాన్పు చేయాలి. అందుకు విరుద్ధంగా రూ.20 వేలు వరకూ అదనంగా వసూలు చేసిన పరిస్థితి నెలకొంది. ఇదేమని అడిగితే ఆసుపత్రి యాజమాన్యం సరైన సమాధానం చెప్పని పరిస్థితి ఉంది. గట్టిగా నిలదీస్తే రోగికి వైద్యం అందించరేమోననే భయం ఆ కుటుంబాన్ని వెంటాడటంతో మౌనంగా రోదించడం తప్ప వేరే గత్యంతరం తప్పడ ంలేదు'.

'ఏలూరు జిల్లా పరిధిలో ఒక యువకుడు ప్రమాదంలో కాలు ఎముక విరిగింది. ఏలూరులోని ప్రయివేటు ఆసుపత్రిలో చూపిస్తే విజయవాడ తీసుకెళ్లమని చెప్పడంతో అక్కడ ఎన్‌టిఆర్ వైద్యసేవ ఉన్న నెట్‌వర్క్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఎన్‌టిఆర్ వైద్య సేవ వర్తింపజేయకుండా ఎముక ఆపరేషన్‌కు సొమ్ము వసూలు చేసిన పరిస్థితి నెలకొంది. అడిగితే వేరే ఆసుపత్రికి వెళ్లిపోవాలని అంటారనే భయంతో రోగి కుటుంబీకులు ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉండిపోయారు.'


ప్రధాన సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ముస్లింలు

వక్ఫ్ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధం

అవగాహన సదస్సులో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి
'వక్ఫ్' సవరణకు వ్యతిరేకంగా ముస్లింల ర్యాలీ, నిరసన


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదం తెలిపినటువంటి వక్ఫ్ చట్ట సవరణ బిల్లు మైనారిటీలకు తీవ్ర నష్టం కలిగిస్తుందని, అటువంటి వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో కుక్కునూరు చర్చి హాస్టల్ ఆవరణలో వక్ఫ్ చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు మండలంలోని అన్ని గ్రామాల నుండి ముస్లిం మహిళలు, ముస్లిం పెద్దలు 300 మంది పాల్గొన్నారు. ఈ సదస్సును ఉద్దేశించి ఎ.రవి మాట్లాడుతూ వక్ఫ్ చట్ట సవరణ బిల్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే లక్ష్యంగా కేంద్రంలో బిజెపి పాలన సాగుతుందన్నారు. వక్ఫ్ బోర్డు చట్టసవరణ బిల్లుతో మైనారిటీలకు తీరని అన్యాయం జరుగుతుందన్నారు. దీని ప్రభావం కేవలం మైనార్టీలపైనే కాదని, భవిష్యత్తులో అటు హిందువులపైన, ఇటు క్రైస్తవులపై పడుతుందన్నారు. అనంతరం స్థానిక సంజయ్ నగర్ సెంటర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, అక్కడి నుండి ప్రధాన సెంటర్ వరకు ముస్లిం మహిళలు, పురుషులు, పిల్లలు జాతీయ జెండాలను చేతబూని హిందూ.. ముస్లిం భాయి భాయి, ప్రజాస్వామ్య హక్కులను మతసామరస్యాన్ని కాపాడాలి, అన్ని మతాలను సమానంగా చూడాలి, కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన వక్ఫ్ చట్ట సవరణను వెంటనే వెనక్కు తీసుకోవాలని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రధాన సెంటర్లో అరగంట పాటు నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహశీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి కుక్కునూరు సర్పంచి రావు మీనా, సిపిఐ, వైసిపి, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ నేతలు పూర్తి మద్దతు తెలిపి పాల్గొన్నారు. సిపిఎం నాయకులు యర్రంశెట్టి నాగేంద్రరావు, వై.సాయి, లక్ష్మయ్య, రమేష్, సిపిఐ జిల్లా నాయకులు మునీర్, చారి, లక్ష్మయ్య, బాబూరావు, వైసిపి నాయకులు తాండ్ర రాజేష్, వినోద్, రవి, సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు ఎస్‌కె.గౌస్, ఎస్‌కె.ముస్సీ, కాంగ్రెస్ నాయకులు రాజులు, వీరయ్య, ముస్లిం నాయకులు ఖాదర్ బాబా, చాంద్‌పాషా, సలీం, ఖాజీ, చీరవల్లి, కుక్కునూరు మసీదుల ఇమాములు తదితరులు పాల్గొన్నారు

ఉంగుటూరు టోల్‌ప్లాజాను వేరే ప్రాంతానికి మార్చాలి

ఆరు గ్రామ పంచాయతీలు తీర్మానం

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రస్తుతం ఉంగుటూరులోని టోల్‌గేటును నాచుగుంట-వెల్లమిల్లి దారి వద్దకు మార్చాలని కాగుపాడు, దొంతవరం, ఉంగుటూరు, విఎపురం, కాకర్లమూడి తదితర ఆరు పంచాయతీలు తీర్మానాలు చేశాయి. ఆ తీర్మానాలను టోల్‌ప్లాజ్ నిర్వాహకులకు అందజేసినా తీసుకోలేదని కూటమి నాయకులు విమర్శించారు. ఈ మేరకు సోమవారం టిడిపి మండలాధ్యక్షుడు పాతూరి విజయకుమార్ అధ్యక్షతన తీర్మానాలు చేసిన గ్రామాల సర్పంచులు, కూటమి నాయకులు సమావేశమయ్యారు. టిడిపి నాయకుడు కడియాల రవిశంకర్ మాట్లాడుతూ ఇప్పుడున్న టోల్‌గేటును నాచుగుంట వద్దకు మార్చేందుకు గతంలోనే భూసేకరణ చేసి సంబంధిత భూయజమానులకు హైవే అథారిటీ పరిహారం కూడా ఇచ్చేశారన్నారు. అయితే నాచుగుంట వద్ద టోల్‌ప్లాజా నిర్మించకుండా ఏలూరు కాలువ గట్టు ఆక్రమించి ఉంగుటూరులోనే కొనసాగించడం వల్ల తమ గ్రామాల


మాట్లాడుతున్న కడియాల రవిశంకర్


రహదారులు భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. టోల్ పన్ను నుంచి తప్పించుకునేందుకు భారీ వాహనాలు సైతం ఉంగుటూరు, కొత్తగూడెం, నాచుగుంట గ్రామాల్లోంచి రాకపోకలు సాగించడంతో కోట్లాది రూపాయలతో నిర్మించిన రహదారులు గోతులతో పాడైపోతున్నాయని, స్థానికులు సైతం నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారని ఉంగుటూరు సర్పంచి బండారు సింధు అన్నారు. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారికి ఎలాంటి పరిహారమూ ఇవ్వకుండా వ్యాపారం చేసుకుంటున్న టోల్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాతూరి విజయకుమార్ మాట్లాడుతూ 2015లో ఉంగుటూరు టోల్‌గేటు వస్తుందంటే తామంతా అప్పట్లో సహకరించామని, ఇక్కడి నిర్వాహకులు అహంకారపూరితంగా వ్యవహరిస్తూ స్థానికులకు పాస్‌లు ఇవ్వడం లేదని ఆరోపించారు. మరుగుదొడ్ల నీరు పంట బోదెల్లోకి వదిలేయడం వల్ల రైతులు చాలా ఇబ్బంది పడుతున్నామని నాచుగుంటకు చెందిన చిట్టూరి హరిబాబు అన్నారు. టోల్‌గేటు మార్చకపోతే నెల రోజుల తరువాత కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి హైవేను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఇమ్మణి గంగాధరరావు, సింగులూరి ధర్మారావు, పొట్ల ఏడుకొండలు, శీరెడ్డి నరశింహరావు, కంభంపాటి పెద్దిరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

మంత్రి సత్యకుమార్ యాదవ్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

డాక్టర్ బిఆర్.అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ సెంటర్‌లోని బిఆర్.అంబేద్కర్ విగ్రహానికి రాష్ట్ర వైద్య ఆరోగ్య సంక్షేమ శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సోమవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధన దిశగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయంటే దానికి కారణం అంబేద్కర్ మార్గదర్శకాల వల్లేనన్నారు. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గంటా పద్మశ్రీ, ఏలూరు, దెందులూరు ఎంఎల్‌ఎలు బడేటి రాధాకృష్ణ, చింతమనేని ప్రభాకర్, విజయవాడ ఆర్‌టిసి జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ అంబికా కృష్ణ, డిఎంహెచ్‌ఒ డాక్టర్ మాలిని, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన మంత్రి

16న చింతలపూడిలో జాబ్‌మేళా

ప్రజాశక్తి - ఏలూరు

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో చింతలపూడిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 16వ తేదీ బుధవారం నాడు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఎన్.జితేంద్రబాబు సోమవారం తెలిపారు. ఈ జాబ్ ఫెయిర్‌లో 11 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని, సుమారు 750 మంది నిరుద్యోగ యువతీ యువకులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటిఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు గల వారు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు 9666322032, 9000803414, 9182342688ను సంప్రదించాలని సూచించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు తమ బయోడేటా, సర్టిఫికెట్స్ నకళ్లతో హాజరు కావాలని ఆయన కోరారు.

ప్రమాదాలను గుర్తించి సమాచారం అందించండి

ప్రజలకు విద్యుత్ శాఖ సూచన



ప్రజాశక్తి - నూజివీడు టౌన్

కురుస్తున్న వర్షాలు, ఉరుములు మెరుపులు, ఈదురు గాలుల కారణంగా విద్యుత్తు ప్రమాదాలను ముందుగా గుర్తించి అధికారులకు తెలియజేయాలని ఎపి ఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ అన్నారు. ఇలా ముందుగా ప్రమాదాన్ని గుర్తించి సమాచారం అందించడం ద్వారా తగిన జాగ్రత్త చర్యలు పాటించి పెను ప్రమాదాల నుంచి రక్షించే అవకాశం ఉంటుందన్నారు. తద్వారా పశువులు, ఇతర జంతువులు, మనుషుల ప్రాణాలకు ప్రమాదం లేకుండా తగిన రక్షణ చర్యలు చేపట్టగలుగుతామన్నారు. విద్యుత్ హెవీ లైన్స్, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, ఇతర విద్యుత్ పరికరాల వద్ద ప్రమాదాలను గుర్తిస్తే తక్షణమే సమీపంలోని విద్యుత్ శాఖాధికారులకు తెలియజేయాలన్నారు. ఇది ప్రతిఒక్కరూ బాధ్యతగా గుర్తించి ప్రమాద నివారణకు సహకరించాలని కోరారు.

పలుచోట్ల ప్రత్యేక గ్రామసభలు

ప్రజాశక్తి - భీమడోలు

మండలంలోని వివిధ గ్రామపంచాయతీల్లో సోమవారం ప్రత్యేక గ్రామసభలను నిర్వహించారు. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న గుండుగొలను సొసైటీ మాజీ అధ్యక్షులు వగ్వాల భాస్కర్ లిఖిత పూర్వకంగా ఇచ్చిన ఫిర్యాదులో తమ పంచాయతీకి సమీపంలోని ఏలూరు కాలువపై ఏర్పాటుచేసిన బెయిలీ బ్రిడ్జి సమస్యను పరిష్కరించాలని కోరారు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని రోడ్లు భవనాల శాఖ చేపట్టాల్సి ఉందని, నిధుల కొరత కారణంగా ఆ పనులను తాము చేపట్టలేదని, గ్రామపంచాయతీ చేపట్టాలని కోరిందని తెలిపారు. దీని దృష్టిలో ఉంచుకుని సదరు బెయిలీ మరమ్మతు పనులను ప్రజల సౌకర్యార్థం గ్రామపంచాయతీ చేపట్టాలని కోరారు. భీమడోలు గ్రామపం చాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమానికి సర్పంచి సునీత మాన్‌సింగ్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు ముళ్లగిరి జాన్సన్ మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కొనేందుకు రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన గ్రామ సచివాలయ వ్యవసాయ సహాయకులు ఆ తరహా ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమడోలు నీటి సంఘం అధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, గ్రామ సచివాలయ కార్యదర్శి హేమసుందర్, జెడ్‌పిటిసి సభ్యులు తుమ్మగుంట భవానీ రంగా పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచి

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఆదర్శప్రాయం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రకృతి వైపరీత్యాలు, అనుకోని విపత్తులు ఎదురైన సమయంలో ప్రాణాలకు తెగించి ఆస్తులు, ప్రాణాలు కాపాడేందుకు ముందుకొచ్చేది అగ్నిమాపక శాఖ సిబ్బంది అని, వారి సేవలు అందరికీ ఆదర్శప్రాయమని భీమడోలు మానస ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ యలమర్తి రవీంద్రకుమార్ అన్నారు. భీమడోలు ఫైరాఫీసర్ నాగరాజు ఆధ్వర్యంలో అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నెల 20వ తేదీ వరకు సాగే ఈ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. వారోత్సవాలను మానస ఇంగ్లీష్ మీడియం స్కూల్ కరస్పాండెంట్ రవీంద్రకుమార్ ప్రారంభించారు. వారోత్సవాల కరపత్రాలను విడుదల చేశారు. విధి నిర్వహణలో అగ్నిమాపక సిబ్బంది వినియోగించే పరికరాలు, వాటి పనితీరు గురించి అసిస్టెంట్ ఫైరాఫీసర్లు ఇమ్మానుయేల్, నాగబాబు వివరించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం శకటంతో విద్యార్థులు, సిబ్బంది భీమడోలు పురవీధులలో నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఫైరాఫీసర్ నాగరాజు మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే రోజువారీ కార్యక్రమాలు వివరించారు. గత సంవత్సర కాలంలో కేంద్రం పరిధిలో 50 విజ్ఞప్తులు రాగా, సిబ్బంది సకాలంలో స్పందించడం వల్ల రూ.1.05 కోట్లు విలువైన ఆస్తులను కాపాడామన్నారు. ఈ సంఘటనల్లో సుమారు రూ.34 లక్షల విలువైన ఆస్తి నష్టం జరిగిందన్నారు. ఏలూరు, పోలవరం కాలువలతోపాటు ఇతర చోట్ల సుమారు ఆరుగురు నీట మునగ్గా నలుగురిని కాపాడమన్నారు. ప్రస్తుతం వినియోగిస్తున్న అగ్నిమాపక శకటం శిథిలమైందని, తాత్కాలిక మరమ్మతులతో దానితోనే కాలం గడుపుతున్నామని తెలిపారు. జులైలో నూతన వాహనం మంజూరుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారన్నారు. నూతన బోట్లు కూడా రావాల్సి ఉందని తెలిపారు.


ర్యాలీని ప్రారంభిస్తున్న మానస పాఠశాల కరస్పాండెంట్

చేపల వేటకు విరామం

జూన్ 14 వరకూ కొనసాగనున్న నిషేధం
61 రోజులపాటు సముద్రంలో చేపల వేట నిషేధం
నిబంధనలు అతిక్రమిస్తే బోటు సీజ్, జరిమానా
అందని గతేడాది భృతి


వేట పడవలు

ప్రజాశక్తి - నరసాపురం

సముద్రంలో వేట నిషేధం ఈ నెల 15వ తేదీ మంగళవారం నుండి అమలు కానుంది. ఇది జూన్ 14వ తేదీ వరకూ 61 రోజులు అమలు కానుంది. ఆయా సమయాల్లో వేట సాగిస్తే మత్స్య సంపద దెబ్బతింటుందనే ఉద్దేశంతో ప్రతియేటా ప్రభుత్వం వేట విరామం ప్రకటిస్తోంది. ఆ సమయంలో మత్స్యకారులకు గత ప్రభుత్వం రూ.10 వేలు భృతి అందించింది. తాము అధికారంలోకి వస్తే పరిహారం రెట్టింపు చేస్తామని ఎన్నికల్లో కూటమి హామీ ఇచ్చింది. గతేడాది ప్రభుత్వ విధివిధానాలు ఖరారు కాక భృతి చెల్లించలేదు. ఈ ఏడాది పరిహారం చెల్లింపునకు అర్హులైన వారిని గుర్తించాలని మత్స్యశాఖ ఆదేశించింది. జిల్లాలో మొత్తం 19 కిలోమీటర్ల సముద్రతీరం ఉంది. ఏటా మాదిరిగానే ఈ ఏడాదీ ప్రభుత్వం వేట విరామం ప్రకటించింది. వేట నిషేధ సమయంలో చేపల పునరుత్పత్తి ఉంటుందని, వాటి సంతతి పెరుగుదల ప్రోత్సహించడం ద్వారా వచ్చే సంపద మరింత పెంపొందుతుందని, ఈ క్రమంలో నిషేధం విధించినట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే ఆయా బోట్ల యజమానులకు సముద్ర మత్స్య క్రమబద్ధీకరణ 1994 చట్టాన్ని అనుసరించి చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరిస్తున్నారు. బోట్లు, మత్స్య సంపదను స్వాధీనం చేసుకుంటామని, జరిమానా విధించి, డీజిల్ రాయితీ, ఇతర సౌకర్యాలు నిలిపివేస్తామని తెలిపారు. చేపల వేట నిషేధం సక్రమంగా అమలయ్యేందుకు మత్స్య శాఖ, కోస్ట్‌గార్డ్, కోస్టల్ సెక్యూరిటీ పోలీసులు, నేవీ, రెవెన్యూ అధికారులతో గస్తీ నిర్వహిస్తారని తెలిపారు.

జిల్లాలో నరసాపురం, మొగల్తూరు మండలాల్లో సముద్ర తీరం వెంబడి పేరుపాలెం, కెపి.పాలెం, మోళ్లపర్రు, పెదమైనవానిలంక, చినమైనవానిలంక, వేములదీవి, బియ్యపుతిప్ప గ్రామాల్లో సముద్ర వేటకు వెళ్లేవారు ఉన్నారు. ఇలా మొత్తం 12 మత్స్యకార గ్రామాలున్నాయి. మత్స్యకారుల జనాభా 38,652 ఉండగా, క్రియాశీల మత్స్యకారులు 9,558 మంది ఉన్నారు. మొత్తం జిల్లాలో 145 మోటరైజ్డ్, 312 నాన్ మోటరైజ్డ్ బోట్లు, మెకనైజ్డ్ బోటు ఒక్కటి ఉన్నాయి. సముద్రపు వేటకు వెళ్లే మత్స్యకారుల సంఖ్య 1814గా గుర్తించారు. మోటరైజ్డ్ బోటుకు ఆరుగురు చొప్పున మత్స్యకారులకు రూ.60 వేలు అందిస్తారు. నాన్ మోటరైజ్డ్ బోట్లకు బోటుకు ముగ్గురు చొప్పున రూ.30 వేలు అందిస్తారు. అయితే పెరిగిన ఖర్చుల దృష్ట్యా భృతి సరిపోవడం లేదని, పెంచాలని గంగపుత్రులు అంటున్నారు. సముద్ర తీరం వెంబడి కొన్నేళ్ల నుండి సముద్రంలో కాలుష్య జలాలు పెరిగిపోవడంతో రాత్రీ పగలు వేటాడినప్పటికీ మత్స్య సంపద అంతగా లభించడం లేదని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది నిలిచిన భృతిని సైతం కూటమి ప్రభుత్వం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

నిషేధం సమయంలో చేపల వేట వద్దు
ఎల్ఎల్ఎన్.రాజు, మత్స్య శాఖ సహాయ సంచాలకులు, నరసాపురం



నిషేధం సమయంలో సముద్రంలో చేపల వేట చేపట్టొద్దు. నిషేధ కాలంలో ప్రభుత్వ ఉత్తర్వులను అతిక్రమిస్తే నిబంధనల ప్రకారం బోటు లైసెన్స్ రద్దు చేయడంతోపాటు పట్టుబడిన మత్స్య సంపదను స్వాధీనపర్చుకుని మత్స్యకారులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే మత్స్యకారులకు వేట నిషేధంపై అవగాహన కల్పించాం.

భీమవరంలో నేడు ఆక్వా రైతుల సదస్సు

విచ్చేయనున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు,
రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు బి.బలరాం
సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

భీమవరం : ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 15వ తేదీ మంగళవారంనాడు స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాల వల్ల రాష్ట్రంలోని ఆక్వా రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు. రైతులు, ప్రజలు కదలి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవడం ద్వారానే ట్రంప్ విధానాలను ఎదుర్కొని దేశాన్ని, రైతులను కాపాడుకోగలమని తెలిపారు. ఈ సమస్యల నుండి ఆక్వా రైతాంగాన్ని ఏ విధంగా కాపాడుకోవచ్చో ఈ సదస్సు వివరించబోతుందని తెలిపారు. సదస్సుకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, ఉపాధ్యక్షులు బి.బలరాం హాజరౌతు న్నారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు ఆక్వా రైతులు, వ్యాపారులు, విద్యార్థులు, యువజనులు, ఆక్వా కార్మికులు పెద్దఎత్తున తరలిరావాలని గోపాలన్ కోరారు.


వారోత్సవాలను ప్రారంభిస్తున్న నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్

అగ్నిమాపక వారోత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ప్రజలు అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్ అన్నారు. పట్టణంలోని అగ్నిమాపక కేంద్రం వద్ద అగ్నిమాపక వారోత్సవాలను ఆయన సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవ్వరూ నిప్పుతో చెలగాటం ఆడవద్దన్నారు. కొద్దిపాటి నిర్లక్ష్యం అపార నష్టానికి, ప్రాణాపాయస్థితికి చేరుతుందని హెచ్చరించారు. ప్రమాదాన్ని ముందుగా గుర్తించి అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పెరుగుతున్న ఎండల నేపథ్యంలో ప్రతిఒక్కరూ అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రమాదాలు సంభవించిన తక్షణమే 101కు కాల్ చేయాలన్నారు. సిద్ధంగా ఉండే అగ్నిమాపక సిబ్బంది వాహనంతో వచ్చి ప్రమాద స్థాయిని తగ్గిస్తారని వివరించారు. ఈ నెల 14వ తేదీ నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ వారోత్సవాలు ఏటా నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ఫైర్ ఆఫీసర్ మత్త్యం, అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.


ఆర్థిక సాయం చేస్తున్న మానవత సభ్యులు

అనారోగ్య బాధితులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భీమడోలు

సూరప్పగూడెంలో అనారోగ్యంతో చికిత్స ఇబ్బంది పడుతున్న ముగ్గురికి స్వచ్ఛంద సంస్థ మానవత భీమడోలు శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఆర్థిక సహాయాన్ని అందించినట్లు శాఖ చైర్మన్ గుళ్ల సూకరాజు తెలిపారు. వీరిలో ఇద్దరు కుటుంబ యజమానులు కాగా, ఒకరు విద్యార్థిని ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల రాంబాబు, ఆర్.గంగాధరరావు, ఉమామహేశ్వరరావు, శాఖ సభ్యులు పంచకర్ల సత్యనారాయణ, గంధం వెంకట్రావు, జి.రమణశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ఇంటర్‌లో ఉత్తమ మార్కులు

ప్రజాశక్తి - టి.నరసాపురం


రోషిత


హైమవతి

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) మొదటి సంవత్సరంలో ఇంటర్మీడియట్ బాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు ప్రిన్సిపల్ బి.ఎల్.స్వామి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొక్కొంద రోషిత మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ఎంపిసిలో 470 మార్కులకు 452 మార్కులు, పసుపులేటి హైమవతి మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ బైపిసిలో 440 మార్కులకు 411 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో మరింత ప్రతిభ కనబరుస్తారని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను విద్యాశాఖాధికారులు టి.రామ్మూర్తి, ఎస్.కళ్యాణి పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

నేరాలు - ఘోరాలు

తాళం వేసిన ఇంట్లో చోరీ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి సమయంలో తాళం వేసిన ఇంట్లో గుర్తు తెలీని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన జయవరపు గణేష్ కుటుంబం రెండు రోజుల క్రితం బాసర దేవాలయానికి వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దొంగతనానికి పాల్పడ్డారు. సోమవారం ఉదయం బంధువులు ఇంటికి వచ్చి చూడగా ఇంట్లో ఉన్న నగదు, బంగారం మాయమైనట్లు పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిపారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని ఇంటి పరిసరాలను పరిశీలించారు. అనంతరం డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లను రప్పించి తనిఖీ చేసినట్లు ఎస్ఐ నవీన్ కుమార్ తెలిపారు. దొంగతనం ఘటన కుటుంబ సభ్యులకు తెలియడంతో హుటాహుటిన గ్రామానికి వస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని పి.అంకంపాలెం గ్రామ శివారులో సోమవారం సాయంత్రం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ పి.నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం పి.అంకంపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.3,500 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారందరిని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పుల్లల లారీని స్వాధీనం చేసుకున్న అధికారులు

మారుజాతి పుల్లలు స్వాధీనం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రూ.60 వేల విలువైన మారుజాతి పుల్లలను స్వాధీనం అటవీ శాఖాధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. గోకవరం నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో, తుని నుంచి కొయ్యలగూడెం వైపు వెళ్తున్న 12 టైర్ల లారీలో తరలిస్తున్న మారుజాతి పుల్లలను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ సుమారు రూ.60 వేలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. కన్నాపురం సెక్షన్ అధికారి బి.దినేష్ నేతృత్వంలో జరిగిన ఈ ఆపరేషన్‌లో సిబ్బంది కె.నవీన్, శ్రీకాంత్, ఎఫ్‌బిఒ మోషే పాల్గొన్నారు.

ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

నవభారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతిఒక్క పౌరుడు కృషి చేయాలని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో అంబేద్కర్ 134వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఎస్‌పి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడారు. అనంతరం మిఠాయిలు పంచారు.

ఏలూరు సిటీ : భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ 134వ జయంతి సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్‌పి చైర్ పర్సన్ పద్మశ్రీ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జెడ్‌పిటిసి సభ్యులు మండల సరస్వతి కొండల రావు, కార్పొరేటర్ కలవకొల్లు సాంబ, జిల్లా పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. ఏలూరు శాంతినగర్‌లోని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ క్యాంపు కార్యాలయంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. టిడిపి ఎస్‌సి విభాగం, ప్రజా సంఘాలు, కూటమి నాయకులు, కార్యాలయం సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి విభాగం నాయకులు, లంకపల్లి మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు. ఏలూరులో పలు డివిజన్లలో నిర్వహించిన వేడుకల్లో ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఎపిఎస్ ఆర్‌టిసి విజయవాడ జోన్ - 2 ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అంబేద్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బత్తిన విజయకుమార్, టిడిపి నాయకులు తాళం నాని, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు స్పోర్ట్స్ : నివాళులర్పిస్తున్న ఎస్‌పి

ద్వారకాతిరుమల : స్థానిక ఎస్‌బిఐ కూడలిలో నిర్వహించిన వేడుకల్లో మాజీ హోం శాఖ మంత్రి తానేటి వనిత ముఖ్యఅతిథిగా పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి గజ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యువ నాయకుడు బొండాడ మోహిని వెంకన్నబాబు, పోనమాల ఉమామహేశ్వరరావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు. పంగిడిగూడెం, ద్వారకాతిరుమల, దొరసానిపాడు, జి.కొత్తపల్లి గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహాలకు గోపాలపురం ఎంఎల్ఎ వెంకటరాజు పూలమాలవేసి నివాళులర్పించారు.

జంగారెడ్డిగూడెం : స్థానిక బస్టాండ్ వద్ద అంబేద్కర్ జయంతి వేడుకలు ప్రొఫెషనల్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ జంగారెడ్డిగూడెం వారి ఆధ్వర్యంలో అలుగు ఆనంద్ శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిఎస్‌పి యు.రవిచంద్ర హాజరై మాట్లాడారు. సిపిఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కొయ్యలగూడెం : మండల కేంద్రంలోని ఎస్‌సి కాలనీలో సిపిఐ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ నాయకులు మాట్లాడారు. పొంగుటూరు గ్రామంలో స్థానిక ఎస్‌సి పేటలో బాబూ జగ్జీవన్‌రామ్ కమిటీ, యూత్, పెద్దలు కలిసి అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులతో కేక్ కటింగ్ చేయించారు. పరింపూడి గ్రామంలో సర్పంచి ముప్పిడి విజయకుమారి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచారు.


భీమడోలు : భీమడోలు, అంబరుపేట, పొలసానిపల్లి గ్రామాల పరిధిలో నిర్వహించిన కార్యక్రమాలకు టిడిపి ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి సత్కరించారు. అర్జావారిగూడెంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న దాత డాక్టర్ బాలు తరపున పేదలకు దుస్తుల పంపిణీ చేశారు. పొలసానిపల్లిలో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచి షేక్ రహీమా బేగం హసేనతో కలిసి హాజరైన గన్ని వీరాంజనేయులు మొక్కలను నాటారు. మానవత భీమడోలు శాఖ కార్యాలయంలో శాఖ సభ్యుల ఆధ్వర్యంలో భీమడోలు కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గీతాంజలి, గోపాలకృష్ణ ఇతర సభ్యుల ఆధ్వర్యంలో జయంతి కార్యక్రమాలను నిర్వహించారు.

ముసునూరు : మండలంలోని 16 గ్రామాల్లో డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాట్రేనిపాడులోని టిడిపి నాయకులు గద్దల మోహన్‌రావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిడిపి వేల్పుచర్ల గ్రామ నాయకులు గరికి ముక్కు, నాని, లక్కపాము కాంతారావు, మెదరమెట్ల సురేంద్ర, కొండేటి బాబి, కొల్లి గంగారాం, రాపర్ల బాలకృష్ణ, మందలపు ధర్మరాజు, రాపర్ల ప్రతాప్, గద్దల మోహన్‌రావు, పిన్నిబోయిన మంగయ్య, గూడపాటి అజయ్, గద్దె రఘుబాబు, పులి బళ్ల సత్యనారాయణ, పాశం నాగబాబు, వేంపాటి శ్రీనివాసరావు, కె.రాంబాబు, కె.దాసు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం స్ఫూర్తి భవనంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, రాష్ట్ర సమితి సభ్యులు బండి వెంకటేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏలూరులోని గిరిజన లంబాడ భవన్ వద్ద రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుగ్గులోతు కృష్ణ మొక్కలను నాటారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రిన్సిపల్ జి.గిరిబాబు మాట్లాడారు.

నూజివీడు టౌన్ : ఆర్‌జియుకెటి నూజివీడు క్యాంపస్ కాలేజీ పరిపాలన బ్లాక్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్‌జియుకెటి రిజిస్ట్రార్, నూజివీడు డైరెక్టర్ అమరేంద్ర కుమార్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పించారు. టిడిపి నూజివీడు నియోజకవర్గ కార్యాలయంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, మహిళలు కలిసి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక నెహ్రూ పేట నుండి శ్రీనివాస సెంటర్ వరకు అంబేద్కర్ చిత్రపటాన్ని భారీ ర్యాలీతో ఊరేగింపు నిర్వహించారు. శ్రీనివాస సెంటర్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమతా సైనికుల రాష్ట్ర అధ్యక్షులు హైకోర్టు న్యాయవాది పాలేటి ఉమా మహేశ్వరరావు కోర్ కమిటీ సభ్యులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

టి.నరసాపురం: మండలంలోని బొర్రం పాలెం, వీరభద్రవరం, టి.నరసాపురం, పుట్రేపు, రుద్రకోట రాజుగూడెం, కేతవరం, బందంచర్ల, మక్కినవారిగూడెం తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు, జయవరపు శ్రీరామమూర్తి, ఎస్ఐ ఎం.జయబాబు, తాడేపల్లి చందు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.



ఏలూరు సిటీ : నివాళులర్పిస్తున్న జెడ్‌పి చైర్‌పర్సన్

చింతలపూడి : నగర పంచాయతీ బోయగూడెం, పాత బస్టాండ్, పాత చింతలపూడిలో నిర్వహించిన వేడుకల్లో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లింగపాలెం మండలం వేములపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక సర్పంచి నత్తా నవ్య దీప్తితో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. యువతకు టెన్నిస్, క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

జీలుగుమిల్లి : మండలంలోని జీలుగుమిల్లి, దర్భగూడెం, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించిన జయంతి వేడుకల్లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కటింగ్ చేశారు. అనంతరం లక్ష్మీపురంలో నూతనంగా నిర్మించిన అంబేద్కర్ భవన్‌ను ప్రారంభించారు.

మండవల్లి : అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో కైకలూరు ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్, ఐఆర్ఎస్ చాగంటి సంజీవరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎంఎల్ఎ జయమంగల వెంకటరమణ మాట్లాడారు. అనంతరం రెండు వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

చాట్రాయి : మండలంలోని చిన్నంపేట గ్రామంలో అంబేద్కర్ కమిటీ సభ్యులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చనుబండలో, చాట్రాయిలో, జనార్ధనవరంలో అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ డి.రామకృష్ణ ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు.

ముదినేపల్లి : ముదినేపల్లి ఆదర్శ దళిత పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ముదినేపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పెంచారు. జై భీమ్ యువజన సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించిన అనంతరం అంబేద్కర్ నగర్‌లో రెండు వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వాడవల్లితో పాటు పలు గ్రామాల్లో అన్న సమారాధన నిర్వహించారు. అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటాన్ని గ్రామాల పురవీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో నిమ్మగడ్డ బిక్షాలు, సేవ నాగ జగన్ బాబూరావు, లేళ్ల ప్రసాద్, దాకరపు నాగమల్లేశ్వరరావు, లేళ్ల ఆంజనేయులు, బేతపూడి వెంకటరమణ అంబేద్కర్ యూత్ తదితరులు పాల్గొన్నారు. మండలంలోని చినపాలపర్రు శివారు కోడూరు అడ్డరోడ్డు వద్ద ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ ఆవిష్కరించారు. చినపాలపర్రు, పెదపాలపర్రు ముదినేపల్లి తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు ఎంఎల్ఎ శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

దెందులూరు : పెదవేగి మండలం గార్లమడుగు పంచాయతీ పరిధిలోని ములక్కాయపాడులో మారుమూడి. థామస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అంబేద్కర్ విగ్రహాన్ని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఆవిష్కరించారు. దెందులూరు గ్రామంలో సంతపేట సెంటర్‌లో అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి మిఠాయిలు పంచారు. రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు పెనుబోయిన మహేష్ యాదవ్, దెందులూరు గ్రామ సర్పంచి తోట ఏసమ్మ, ఉపసర్పంచి బారణాల అప్పారావు, నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఏలూరు దొండపాడులో ఉన్న పరివర్తన్ బధిరుల పాఠశాల, జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా డిసిఐబి జిల్లా కార్యదర్శి ఎ.సర్వేశ్వరరావు హాజరై అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు స్వీట్లు, పండ్లు అందించారు.

వేలేరుపాడు : జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ మండలాధ్యక్షులు గణేశుల ఆదినారాయణ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోట్ల మోహన్‌దొర, దేవిరెడ్డి సుధాకర్, మంచర్ల సమ్మయ్య, బిజెపి నాయకులు పాల్గొన్నారు. స్థానిక ఆటో యూనియన్ వద్ద ఉన్న అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి స్థానిక నాయకులు, ప్రజలు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పోలవరం : మండలంలో అంబేద్కర్ జయంతి వేడుకలు పార్టీలకతీతంగా ఘనంగా నిర్వహించారు. పోలవరం ఏటిగట్టు సెంటర్ వద్ద విగ్రహానికి రాష్ట్ర ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి సొబ్బన మోహన్ అధ్వర్యంలో సభ నిర్వహించారు. అడ్వకేట్ సొబ్బన ఆనందరావు పాల్గొన్నారు. పలు గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

ఆగిరిపల్లి : మనహక్కుల కోసం పోరాడు సాధించు ఉద్యమ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు అయ్యంకి సురేష్‌బాబు ఆధ్వర్యంలో పెద్ద కొటాయి సెంటర్ వద్ద వేడుకలను నిర్వహించిపాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. అంబేద్కర్ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి హైస్కూల్ కూడలి వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి వేడుకలను నిర్వహించారు.

దార్శనికుడు అంబేద్కర్ : మంత్రి పార్థసారథి

నూజివీడు టౌన్ :గొప్ప రాజ్యాంగాన్ని రచించి నవభారత వికాసానికి బాటలు వేసిన దార్శనికుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశంలో ప్రజల అవసరాలు, హక్కులను వెలుగులోకి తెచ్చి అన్ని తరగతులు, కులాలు, మతాల ప్రజలకు సర్వామోదం, అంగీకరమైన రాజ్యాంగాన్ని మనకందించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని పేర్కొన్నారు. అణగారిన సామాజిక తరగతుల సమానత్వం, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన గొప్ప వ్యక్తి అని తెలిపారు.

సిపిఎం, ప్రజాసంఘాల ఆధ్వర్యాన వేడుకలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని సిపిఎం కార్యాలయం సుందరయ్య భవన్ లో సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళి అర్పించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి రాజు, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎన్ఆర్ హనుమాన్లు మాట్లాడారు. స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం శ్రీనివాస సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్దకు వెళ్లి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం సీనియర్ నాయకులు శోభనాద్రి, సిపిఎం నాయకులు వసంతరావు, పద్మాంజలి, ప్రజా సంఘ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని పుట్రేపులో అంబేద్కర్ యువత ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా నాయకులు గుడెల్లి వెంకట్రావు, స్థానిక యూత్ అధ్యక్షులు తాడేపల్లి చందు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. గ్రామంలో సహపంక్తి భోజనాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నంబూరి భాస్కర్, గుర్రం రాజశేఖర్, బత్తుల నవీన్, బాణాల నాగేంద్ర, కె.ఏలియా, కె.ప్రసాద్, అనుమోలు మురళి, మడకం కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : సిపిఎం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్.శివనాగరాజు, టౌన్ కార్యదర్శి షేక్.జహాంగీర్ భాషా, సిఐటియు మండల కార్యదర్శి ఆర్.చంటి, సత్తు కోటేశ్వరరావు, కుశలవ ఎంప్లాయీస్ నాయకులు బి.కోటేశ్వరరావు, బి.రాంబాబు, నాగ చౌదరి పాల్గొన్నారు.

నిడమర్రు : మండలంలోని నిడమర్రు, మందలపర్రు గ్రామాల్లో సిపిఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు నారపల్లి రమణారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, గూడా సోలేమాన్, కొనదల విజయకుమార్, యాళ్ల బాబూరావు, డి.పోతురాజు, యాగన వాసు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి: మండలంలోని ములగలంపల్లిలో లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, సిపిఎం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ యూత్, లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక, సిఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు రాజ్యాంగాన్ని రక్షించుకుంటామని, మతోన్మాదాన్ని వ్యతిరేకిస్తామని నినాదాలు చేశారు. అప్పారావు, సిఐటియు మండల కార్యదర్శి కొండలరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువత నాయకులు వెంప విద్యాసాగర్, ధారా వినోద్‌కుమార్, గుండె ఫణేంద్రబాబు, తూంపాటి శ్రీను, ముస్లిం నాయకులు పటాన్ రహీం తుల్లా, సిఐటియు నాయకులు పల్లంట్ల రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో...

జంగారెడ్డిగూడెం : మండలంలోని ఎ.పోలవరంలో నిర్వహించిన వేడుకల్లో మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలారాణి పాల్గొని మాట్లాడారు. మహిళా సంఘం నాయకురాలు మొగలి మంగ అధ్యక్షత వహించారు. తొలుత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకులు తోనం సోమాలమ్మ, రెడ్డి బోయిన సత్యవతి, ఎర్ర మాలకుమారి, యాగంటి సీత, వీరవల్లి జగదాంబ, బత్తుల వెంకటలక్ష్మి కె.రాములమ్మ, జి.విజయకుమారి పాల్గొన్నారు.


నూజివీడులో...

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం అంబేద్కర్ కాలనీ, రాజీవ్ నగర్ కాలనీ, రామారావుపేట, సెంటర్, ముప్పినవారిగూడెం, దోరమామిడి కోట రామచంద్రపురం గ్రామాల్లో వేడుకలు నిర్వహించారు. అంబేద్కర్ కాలనీ యువకులు, రాజీవ్ నగర్ కాలనీ యువత ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా నాయకులు అందుగుల ఫ్రాన్సిస్ పాల్గొని అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గా మహేశ్వరరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : లౌకిక రాజ్యాంగ పరిరక్షణ, అంటరానితనానికి, కుల వివక్షకు వ్యతిరేకంగా పోరాటం చేయటమే డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌కు నిజమైన నివాళులని బిసి సబ్ ప్లాన్ - ప్రయివేట్ రంగంలో రిజర్వేషన్ల సాధన పోరాట వేదిక జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు తెలిపారు. భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని సోమవారం స్థానిక ఆర్ఆర్.పేటలోని సుందరయ్య గ్రంథాలయంలో వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేదిక జిల్లా కో-కన్వీనర్ ఆగొల్ల వెంకటకృష్ణారావు ముందుగా డాక్టర్ బిఆర్.అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, బిసి నాయకులు గోసాల ఏసుబాబు, సుందరయ్య గ్రంథాలయం నిర్వాహకులు కంది విశ్వనాథం, తదితరులు పాల్గొన్నారు.

ఈదురు గాలులకు నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కొన్ని గంటల పాటు నిలిచిన విద్యుత్ సరఫరా

అంధకారంలోనే పలు గ్రామాలు

ఇబ్బందులకు గురైన ప్రజలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి ఉరుములు, మెరుపులు, ఈదురుగాలితో కూడిన వర్షం పడటంతో విద్యుత్ శాఖకు అపారం నష్టం వాటిల్లింది.


ముదినేపల్లిలో...

సుమారు గంటపాటు వీచిన భీకర గాలులకు మండల వ్యాప్తంగా 30 విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. అనేక గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. పలు గ్రామాలు ఆదివారం రాత్రంతా అంధకారంలోనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్ శాఖ సిబ్బంది అతి కష్టం మీద రాత్రంతా కష్టించి విద్యుత్తును పునరుద్ధరించినప్పటికీ పలు గ్రామాలు అంధకారంలోనే ఉన్నాయి. సోమవారం ఉదయానికి మిగిలిన గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరించారు. మండలంలోని సబ్ స్టేషన్ చిగురుకోటకు వచ్చే రెండు టవర్స్‌లో ఒక టవర్ మండవల్లి మండలం పుట్లచెరువు గ్రామ పరిధిలో చెరువులో పడిపోయింది. పడిన టవర్ సరిచేసేందుకు మూడు రోజుల సమయం పడుతుందని ఎఇ పూర్ణ చంద్రరావు తెలిపారు. ఈ కారణం చేత మూడు రోజుల పాటు మండలంలోని గ్రామాలకు కరెంటు సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.


కలిదిండిలో....

కలిదిండి :మండలంలో ఆదివారం రాత్రి హోరుగాలితో కూడిన వర్షం వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఆదివారం రాత్రి నుంచి సుమారు 16 గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు పలు ఇక్కట్లకు గురయ్యారు. పలు చోట్ల చెట్లు, చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. గుర్వాయిపాలెం సమీపంలో రాష్ట్రీయ రహదారిపై భారీ ప్రచారబోర్డులు ఒరిగిపోయి ప్రమాదభరితంగా ఉన్నాయి. కొద్దిపాటి వర్షంతో కూడిన భారీ ఈదురు గాలులు రొయ్యల సాగు రైతులకు కంటిమీద కునుకులేకుండా చేసింది. విద్యుత్ అంతరాయం వల్ల జనరేటర్స్ మీద ఆధార పడాల్సిన పరిస్థితి నెలకొంది.